
సాక్షి
కుమురం భీం
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



హృదయం.. పదిలమేనా?

ప్రస్తుతం వయోభేదం లేకుండా ఎవరికైనా గుండెపోటు వస్తోంది. ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 8లో▸



పూత అంతంతే..

ఈ ఏడాది మామిడి చెట్లకు పూత అంతంత మాత్రంగానే ఉంది. మామిడిచెట్లను తేనె మంచు పురుగు ఆశించింది. పిందెలు రాలిపోతున్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.4 /17.3

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఆయుర్వేద శిబిరం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటిలోని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20న 'చలో విద్యుత్ సౌధ'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 20న చలో విద్యుత్ సౌధ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఆర్టిజన్ల కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మారుతి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట శనివారం చలో విద్యుత్ సౌధ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న ఆర్టిజన్లను విద్యార్హత ఆధారంగా సబ్ ఇంజినీర్లు, జూనియర్ అసిస్టెంట్లు, జేఎల్ఎంలుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టిజన్లు శ్రీనివాస్, సతీశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల వారీగా పన్నులు వసూలు పూర్తిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ, శానిటేషన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చినట్లు డీఈవో గమానియల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ 2008 డీఎస్సీ ద్వారా ఎస్జీటీ పోస్టులకు 30 మంది బీఈడీ అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. శనివారం సర్టిఫికెట్ పరిశీలనకు 20 మంది హాజరయ్యారని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో వీరిని కాంట్రాక్టు పద్ధతిలో స్కూల్ గ్రేడ్ టీచర్లుగా నియమించామని, సక్రమంగా విధులకు హాజరు కావాలని సూచించారు. జిల్లా పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వందేభారత్.. అందని ద్రాక్షే!?

- జిల్లా మీదుగా నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నిత్యం పరుగు..
- రెండు జిల్లాల పరిధిలో ఎక్కడా ఆగదు.. సీట్లు నిండవు !
- ఐదు నెలలుగా ఆక్యుపెన్సీ 33 శాతమే...
- బోగీలు కుదించే యోచనలో రైల్వే శాఖ
- హాల్టింగ్‌లు పెంచాలంటున్న ప్రయాణికులు



వందేభారత్ రైలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వందేభారత్ రైలు జిల్లా రైలు ప్రయాణికులకు అందని ద్రాక్షగానే మారింది. నిత్యం మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల మీదుగా నాగ్‌పూర్–సికింద్రాబాద్ మార్గంలో పరుగులు పెడుతోంది. అయితే ఈ సూపర్‌ఫాస్ట్ రైలులో ప్రయాణించాలని ఆశపడిన జిల్లావాసుల కల మాత్రం నెరవేరడం లేదు. ఇతర రైళ్లతో పోలిస్తే చార్జీలు ఎక్కువగా ఉన్నా... రెండు జిల్లాల్లో ఎక్కడా స్టాప్‌లు లేకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే నాగ్‌పూర్–సికింద్రాబాద్ మార్గంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు రిజర్వేషన్లు కూడా బుక్ కావడం లేదు. నిత్యం వందల మంది ప్రయాణికులు సికింద్రాబాద్‌వైపు వస్తుంటారు. అయితే వందేభారత్‌ను వినియోగించుకునే అవకాశం లేదు.

నిత్యం రాకపోకలు..

ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా వాసులు నాగ్‌పూర్ వరకు వ్యాపార, వాణిజ్య కార్యక్రమాలతోపాటు వార్ధాలో ఆసుపత్రి, చంద్రాపూర్ వరకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వందేభారత్ రైలు ఎక్కే అవకాశం లేదు. ప్రస్తుతం అందుబాటులో నిజాముద్దీన్–ఢిల్లీ రాజధాని 12437 వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్, కేఎస్ఆర్ బెంగళూరు సిటీ నుంచి ఢిల్లీ నిజాముద్దీన్ 22691రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, నాగ్‌పూర్ వైపు.. దక్షిణ్, జీటీ, తెలంగాణ, దానాపూర్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీక్లీ స్పెషల్‌గా నడిచే 21 రైళ్లు వారంలో ఒక రోజు అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ రైళ్లన్నీ రిజర్వేషన్లతోనే నిండిపోతాయి. సికింద్రాబాద్, చెన్నై, ఆంధ్రా, కర్ణాటక నుంచి నడిచే ఈ రైళ్ల రిజర్వేషన్ భోగీలతోపాటు జనరల్ కంపార్టుమెంట్స్‌లోనూ కాలు పెట్టే జాగా ఉండదు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లోనూ కాజీపేట, నాగ్‌పూర్ మధ్య ఎలాంటి కొత్త రైళ్ల ప్రతిపాదన కూడా లేదు. ఈ క్రమంలో స్థానికుల ప్రయాణం కోసం వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇస్తే, ఇటు కాజీపేట, సికింద్రాబాద్, అటు బల్లార్షా, మహారాష్ట్రవైపు రాకపోకలు సాగించే వారికీ ఉపయుక్తంగా ఉంటుంది. రైల్వేకు ఆదాయం పెరుగుతుంది.

అక్కడ అలా...

మహారాష్ట్రలో చంద్రాపూర్, బల్లార్షాకు మధ్య దూరం కేవలం 14 కిలోమీటర్లే. అయినా అక్కడ రెండు హాల్టింగ్‌లు ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా రామగుండం తర్వాత బల్లార్షా వరకు ఎక్కడా హాల్టింగ్ లేదు. రామగుండం నుంచి బల్లార్షా మధ్య సుమారు వంద కిలోమీటర్లకుపైగానే దూరం ఉంటుంది. కానీ, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి)లో ఎక్కడా హాల్టింగ్ ఇవ్వడం లేదు. కోచ్‌లు కుదించాలన్న ఆలోచన విరమించుకుని మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌లో వందే భారత్‌లో హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా విన్నవిస్తున్నా రైల్వేశాఖ పట్టించుకోవడం లేదు. హాల్టింగ్ లేనిఫలితంగా వందేభారత్ వెలవెలబోతోంది. దీంతో రైల్వేకు కూడా నష్టం వాటిల్లుతోంది. గడిచిన ఐదు నెలల్లో కేవలం 33 శాతం ఆక్యుపెన్సీతోనే నడుపుతున్నారు. దీంతో బోగీలు తగ్గించాలని రైల్వే శాఖ భావిస్తోంది.

ఐదు నెలల్లో వందేభారత్ సగటు ఆక్యుపెన్సీ (సీట్ల భర్తీ)శాతం

నెల	నాగ్‌పూర్-సికింద్రాబాద్	సికింద్రాబాద్-నాగ్‌పూర్
సెప్టెంబర్	22.59	22.44
అక్టోబర్	27.86	49.82
నవంబర్	40.69	27.85
డిసెంబర్	38.31	31.19
జనవరి	32.96	32.51
సగటు	33.81	33.87

ఖాళీగానే సీట్లు.. బోగీల కుదింపు

నాగ్‌పూర్–సికింద్రాబాద్ రైలును గత సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మొత్తం 20 కోచ్‌లతో ప్రారంభమైన ఈ రైలును ఐదు నెలలుగా ప్రయాణికులు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో హాల్టింగ్ ఇవ్వాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు ప్రయాణికులు లేక చాలా వరకు సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కోచ్‌లను కుదించాలని రైల్వే శాఖ భావిస్తోంది. ఈనెల 19 నుంచే కోచ్‌లను తగ్గించి నడిపిస్తారని సమాచారం.

ఈ ప్రాంతంపై చిన్నచూపు...



సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైలుకు మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్టింగ్ ఇవ్వాలని కోరుతున్నా రైల్వే శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. తక్కువ ఆక్యుపెన్సీ నష్టాలతో నడిపించే బదులు స్టాప్‌లు కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగపడుతుంది. రైల్వేకు ఆదాయం పెరుగుతుంది.

– అంకిత్ ఫణిశర్మ, అధ్యక్షుడు, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం

ఫలించిన నిరీక్షణ

- రూ.4.90 కోట్ల పెండింగ్ ఎంపీ ల్యాడ్స్ విడుదల
- బిల్లుల చెల్లింపునకు అధికారుల కసరత్తు
- కాంట్రాక్టర్లు, నాయకుల హర్షం



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత ఎంపీ హయాంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. 17వ లోక్‌సభకు సంబంధించి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.4.90 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా విడుదల చేసింది. వాటి చెల్లింపునకు జిల్లా ముఖ్య ప్రణాళికశాఖ విభాగం అధికారులు కసరత్తు ప్రారంభించారు. వారం, పది రోజుల్లో పనులు చేసిన వారందరికీ బిల్లులు అందించేలా చర్యలు చేపడుతున్నారు. కేంద్ర నిర్ణయంపై ఈ నిధులతో పని చేసిన వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

మూడేళ్ల క్రితం పనులు పూర్తి...

2019–24కి సంబంధించి 17వ లోక్‌సభకు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా సోయం బాపూరావు కొనసాగారు. ఈ సమయంలో ఎంపీ ల్యాడ్స్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.4.90 కోట్లతో కూడిన 160 పనులను ప్రతిపాదించారు. ఇందులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ వంటి తదితర పనులున్నాయి. ఎంపీ ప్రతిపాదించగా వాటికి కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. పరిపాలన అనుమతులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు, బీజేపీ నాయకులు, అప్పటి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు ఈ పనులను తమ తమ ప్రాంతాల్లో చేపట్టి పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లాలో రూ.3.90 కోట్లతో 137 పనులు చేపట్టారు. అలాగే నిర్మల్ జిల్లాలో రూ.52లక్షలతో 11 పనులు, కుమురంభీం జిల్లాలో రూ.43లక్షలతో 11 పనులు, మంచిర్యాల జిల్లాలో రూ.4లక్షలతో కూడిన ఒక పనిని పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయి ఏళ్లు గడిచినప్పటికీ నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేసింది. ఎంపీగా సోయం పదవీ కాలంలో ఎంత ప్రయత్నించినప్పటికీ విడుదల కాలేదు. ఏళ్లుగా బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన వారంతా ఇప్పటి వరకు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడ్డారు.

ఎట్టకేలకు విడుదల...

గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేశ్ బీజేపీ తరఫున గెలుపొందారు. ఆయన గెలిచిన రెండు నెలలకే తన నియోజకవర్గ నిధికి సంబంధించి కేంద్రం రూ.5కోట్ల ఎంపీ ల్యాడ్స్ విడుదల చేసింది. అయితే సోయం పదవీ కాలానికి సంబంధించిన నిధులు మాత్రం పెండింగ్‌లోనే పెట్టింది. ఎంపీ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలవ్వడంతో ఆ నిధులు విడుదలవుతాయో లేదోనని పనులు పూర్తి చేసిన వారిలో ఆందోళన వ్యక్తమైంది. వాటి కోసం గంపెడాశతో ఎదురుచూస్తుండగా వారి నిరీక్షణకు తెరదించుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఎట్టకేలకు పెండింగ్‌లో ఉన్న రూ.4.90 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ బిల్లులను చెల్లించే దిశగా ప్రణాళిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వారం, పది రోజుల్లో పూర్తిస్థాయిలో చెల్లించేలా చర్యలు చేపడుతున్నారు. ఏళ్లుగా బిల్లుల కోసం నిరీక్షిస్తున్న వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి శనివారం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఇంటి నుంచి వస్తుంటారని, తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమైందన్నారు. ఇంటి వద్ద కూడా వారు సన్నద్ధమయ్యే విధంగా తల్లిదండ్రులు అనువైన వాతావరణం కల్పించాలని కోరారు. ఇంట్లో ఫోన్, టెలివిజన్ చూడనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల నేపథ్యంలో వ్యవసాయ పనులకు తీసుకెళ్లొద్దని సూచించారు. ఫలితాల్లో జిల్లాను ముందుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో గమానియల్, డీటీడీవో రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నివేదిక రూపొందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నివేదిక రూపొందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3కోట్ల నిధులతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్డ్ యూనిట్ కేంద్రం ఏర్పాటు, మారుమూల గ్రామాల్లో అంబులెన్స్ సర్వీసు, యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, గురుకుల పాఠశాలల్లో శుద్ధమైన తాగు నీరందించేందుకు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి ముగిసిన తర్వాత పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీఈవో గమానియల్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి సజీవన్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, పశు సంవర్ధకశాఖ అధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో పనిభారం

- ఈజీఎస్ పథకంలో సిబ్బంది కొరత
- ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పనిభారం
- క్షేత్రస్థాయిలో తగ్గుతున్న పర్యవేక్షణ



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ పథకం కింద పేద కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంది. జిల్లాలో ఇప్పటికే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించారు. క్షేత్రస్థాయిలో అవసరానికి అనుగుణంగా సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోంది.

ఏడుగురు మాత్రమే ఈసీలు

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా 1.23 లక్షల కుటుంబాలు జాబ్‌కార్డు కలిగి ఉన్నాయి. ఇందులో 2.43 లక్షల మంది కూలీల పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం 91 వేల యాక్టీవ్ జాబ్ కార్డుల్లో 1.70 లక్షల మంది కూలీలు నిత్యం పనులకు వెళ్తున్నారు. జిల్లాలోని 15 మండలాలు ఉండగా, ఒక్కో మండలానికి ఒక్కో ఈసీ(ఇంజినీరింగ్ కన్సల్టెంట్)ని నియమించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఏడుగురు ఈసీలు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈసీలు లేనిచోట టెక్నికల్ అసిస్టెంట్లకే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఈసీల పాత్ర ఎంతో కీలకమైంది. పనులకు నిర్వహణ సంబంధించిన మ్యాపింగ్‌తో పాటు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అంతేకాకుండా టెక్నికల్ అసిస్టెంట్లు చేసిన ఎంబీ రికార్డులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యత కూడా వీరిపైనే ఉంటుంది.

పర్యవేక్షకులేరి..?

మండలస్థాయి పర్యవేక్షకులైన ఏపీవో(అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి) పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 15 మంది ఏపీవోలు పనిచేయాల్సి ఉండగా 12 మంది మాత్రమే ఉన్నారు. ఏపీవోలు లేనిచోట టీఏలకే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఖాళీలుగా ఉన్న ఏపీవో, ఈసీ పోస్టుల్లో టీఏ(టెక్నికల్ అసిస్టెంట్)లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో వారిపై పనిభారం అధికం అవుతోంది. సాధారణ విధులతోపాటు అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. దీనికి తోడు కొత్త పంచాయతీలు ఏర్పాటు కావడంతో ఒక్కో టీఏ దాదాపు పది పంచాయతీల్లో చేపడుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి పంచాయతీల వారీగా ఎఫ్‌ఏలు

ఉపాధిహామీ పనుల నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్‌ఏ) పాత్ర కీలకం. జిల్లాలో 335 పంచాయతీలకు ప్రస్తుతం కేవలం 150 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ మూడు, నాలుగు గ్రామాల్లో ఏకకాలంలో పనులు చేయిస్తున్నారు. నూతన పంచాయతీల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి, పనులపై పర్యవేక్షణ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఖాళీలు భర్తీ చేసి పనిభారం తగ్గించాలని వారు వేడుకుంటున్నారు.

పనిభారం పెరుగుతోంది



జిల్లాలో సరిపడా ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పనిభారం పెరుగుతుంది. ఒక్కో ఎఫ్‌ఏ మూడు నుంచి నాలుగు పంచాయతీల్లో పనులను చూసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. ప్రస్తుతం విధుల్లో ఉన్నవారిపై పనిభారం తొలగించాలి.

– బోయిరే రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

శ్రామ్‌నేర్ శిబిర్ జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో మార్చి 3 నుంచి 9 వరకు నిర్వహించే బౌద్ధ ధమ్మ దీక్ష శ్రామ్‌నేర్ శిబిర్‌ను జయప్రదం చేయాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ఐ, అంబేడ్కర్ యువజన సంఘం, సిద్ధార్థ యువజన సంఘం, రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బౌద్ధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాగ్‌పూర్‌లోని దీక్ష భూమి బౌద్ధ గురువు బదంత్ ధమ్మ సారథి బుద్ధుడి ప్రవచనాలు, ధమ్మ బోధన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే, ఎస్ఎస్‌డీ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి సందీప్, నాయకులు విలాస్, రాజేంద్రప్రసాద్, రోషన్, విజేయ్, శ్యాంరావు, దుర్గం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముద్ర



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): నేటితరం మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. కైరిగూడ ఓసీపీ వద్ద శనివారం మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు పదోన్నతులు, వివిధ హోదాల ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. సింగరేణిలో ఉద్యోగాలు, పదోన్నతుల కాలపరిమితి గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో మొత్తం 16 డిజిగ్నేషన్లతో ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న డిజిగ్నేషన్లకు అనుగుణంగా వారికి శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో ఆసక్తితో దరఖాస్తు చేసుకున్న మహిళా ఉద్యోగులు ప్రస్తుతం ఎంవీటీసీలో పంపు, కన్వేయర్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, డీజీఎం ఉజ్వల్‌కుమార్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, డీవైజీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు వన్యప్రాణులకు ముప్పు

సిర్పూర్(టి): అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టడం ద్వారా వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉంటుందని ఎఫ్ఎస్‌వో మోహన్‌రావు అన్నారు. సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మేడిపల్లి, చిన్నమాలిని గ్రామాల్లో పెద్దపులి దాడుల్లో మరణించిన పశువుల యజమానులకు శనివారం పరిహారం చెక్కులు అందించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవులను ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజలు వేసవిలో తునికాకు, ఇప్పపువ్వుల సేకరణ కోసం అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టొద్దని సూచించారు. చిన్నమాలిని గ్రామానికి చెందిన సుర్పం గన్నుకు రూ.22వేలు, సుర్పం జంగుకు రూ.27వేలు, మేడిపల్లి గ్రామానికి చెందిన సిడాం భీంరావ్‌కు రూ.12వేల విలువైన చెక్కులు అందించారు.

క్లుప్తంగా

తావిజ్ మహిమ అంటూ మోసం

● రూ.5,600 నగదు కాజేత

ఆదిలాబాద్‌టౌన్: తావిజ్ మహిమతో ఇంటిల్లిపాది ఆనందంతో ఉండటంతో పాటు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి నగదు కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు నెల రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన షేక్ అజారుద్దీన్‌కు మహారాష్ట్రకు చెందిన యాసిన్ అలియాస్ డొంగి బాబా జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వద్ద పరిచయమయ్యాడు. తనలో అతీత శక్తులున్నాయని, తాను తావిజ్ ఇస్తే ఎలాంటి సమస్యలున్నా దూరమవుతాయని నమ్మించాడు. ఇందుకు కొంత డబ్బు ఖర్చవుతుందన్నాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు రూ.5,600 నగదును అప్పగించాడు. దీంతో డొంగి బాబా రెండు పొట్లాలాలను తావిజుగా తయారు చేసి షేక్ అజారుద్దీన్‌కు అందించాడు. వీటిని నెల రోజుల పాటు పడుకునే సమయంలో తలకింద పెట్టుకోవాలని సూచించాడు. బాబా చెప్పిన విధంగా నెల రోజుల పాటు పాటించాడు. బాబా చెప్పిన విధంగా జరుగకపోగా పరిస్థితులు తారుమారు కావడంతో బాధితుడు శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక



శశివంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మూల రాజిరెడ్డి

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన చల్లా శశివంత్‌రెడ్డి కోలిండియా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన శశివంత్‌రెడ్డి ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 22 నుంచి 25 వరకు కలకత్తాలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరుగనున్నాయని, ఈ నెల 26 నుంచి డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న కోలిండియా పబ్లిక్ సెక్టార్ పోటీలలో పాల్గొననున్నట్లు శశివంత్‌రెడ్డి తెలిపారు. శనివారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, క్రీడాకారులు, మిత్ర బృందం సభ్యులు క్రీడాకారుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు పుట్టినిల్లయిన చెన్నూర్‌కు చెందిన శశివంత్‌రెడ్డి ఒక్కడే తెలంగాణ రాష్ట్రం నుంచి కోలిండియా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ లడ్డా, పోగుల సతీశ్, పిట్టల రవి, రాము, చింతల లక్ష్మణ్, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు అజ్గర్ అలీ, తగరం రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై అడవిపందుల దాడి

బోథ్: సోనాల మండలంలోని పెట్రోల్ పంపు వద్ద శనివారం విష్ణు అనే యువకుడిపై అడవిపందులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు పరుగెత్తడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.


స్వగ్రామానికి చేరిన మృతదేహం

జన్నారం: ఓమన్ దేశంలో ఈ నెల 2న మృతి చెందిన మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం మల్లేశ్ (43) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తిరుపతి సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించారు. కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

హృదయం.. పదిలమేనా ?

● ఆందోళన కలిగిస్తున్న గుండెపోటు మరణాలు ● కష్టజీవుల్లోనూ గుండె జబ్బులు ● 36 నుంచి 55 ఏళ్లలోపు వారే అధికం

● మారిన జీవనశైలి, పనిఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్లే కారణం అంటున్న వైద్యనిపుణులు



- జనవరి 21న నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఫణీందర్ (50) స్నేహితులతో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లాడు. కాశీలో దైవదర్శనానికి వెళ్లే క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు.
- మంచిర్యాల జిల్లా చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాలిగంటి లచ్చయ్య (52) జనవరి 30 గురువారం మధ్యాహ్నం క్వార్టర్‌లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు.
- మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్‌కు చెందిన దుర్గం మల్లేశ్ (48) గతేడాది ఉపాధి నిమిత్తం ఓమన్ వెళ్లి సలాల్లోని బల్దియా కంపెనీలో పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 2న గుండెపోటు రావడంతో తాను ఉంటున్న గదిలోనే మృతి చెందాడు.
- మంచిర్యాల జిల్లా జన్నారం పోలీస్ స్టేషన్‌లో రెండో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న తానాజీ నాయక్ (60) ఫిబ్రవరి 4న తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఇటీవల వెలుగు చూసిన ఘటనల్లో ఇవి కొన్ని మాత్రమే.

నిర్మల్‌చైన్‌గేట్: గతంలో యాభై లేదంటే అరవై ఏళ్లు దాటితేనే గుండెపోటు వస్తుందనే భావన ఉండేది. కానీ ప్రస్తుతం వయోభేదం లేకుండా ఎవరికైనా గుండెపోటు వస్తోంది. ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వ్యాయామం చేస్తూనో.. నృత్యం చేసూనో..నడుచుకుంటూ వెళ్తున్న వారు అక్కడికక్కడే కుప్పకూలిపోతున్నారు. అప్పటివరకు ఆరోగ్యంగా, శారీరకంగా ధృఢంగా ఉన్న వారికి సైతం గుండె ఆకస్మాత్తుగా ఆగిపోయి కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఈ ఆకస్మిక మరణాలను సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా తెలుసుకుంటున్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎటాక్.. స్ట్రోక్ వేర్వేరు..

గుండె పనిచేయడం హఠాత్తుగా ఆగిపోవడాన్ని కార్డియాక్ అరెస్ట్ అంటారు. స్పృహ కోల్పోవడం, స్పందించకపోవడాన్ని కార్డియాక్ అరెస్టు ప్రధాన సంకేతాలుగా చెప్పొచ్చు. ఇక మెదడుకు రక్త సరఫరా ఆగిపోవటాన్ని హార్ట్ స్ట్రోక్ అంటారు. అయితే సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల గుండెపోటు సంభవిస్తుంది. రక్తనాళాలు కుంచించుకుపోయినప్పుడు గుండెకు రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోయి గుండెపోటు వచ్చి మరణం సంభవిస్తుంది.

ఆహారపు అలవాట్లలో మార్పులు..

ఇటీవల యువత ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటయ్యారు. దీంతో ఆ ప్రభావం శరీరంలోని అవయవాలపై పడి చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికి తోడు మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు కూడా చిన్న వయస్సులోనే గుండె జబ్బులకు కారణమవుతున్నాయి.

వ్యత్యాసం లేదు..

జీవన శైలి, ఆహారం విషయంలో మధ్యతరగతి ప్రజలకు, నిరుపేదలకు పెద్ద తేడా లేదు. ఆర్థికంగా అంతో ఇంతో నిలదొక్కుకున్న వర్గాల్లోనే కాదు.. వెనుకబడిన వారిలోనూ మాంసం, మద్యం, ధూమపానంలాంటి అలవాట్లు ప్రస్తుతం సర్వసాధారణమయ్యాయి. అధిక రక్తపోటు, మధుమేహ బాధితులు కూడా భారీగా ఉన్నారు. విటమిన్ల లోపం, ఇన్ఫెక్షన్లు కూడా ఈ వర్గంలో గుండె జబ్బులు పెరగడానికి మరో కారణం.

పరీక్షలు చేసుకోవాలి..

గుండెపోటుకు గురికాకుండా వైద్యుల సూచనలు పాటిస్తే గుండె జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. గుండె పనితీరు తెలుసుకోవడానికి అనేక పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండెకు ఆక్సిజన్ సరఫరా నిలిచి గుండెపోటు వస్తుంది. దీనిని గుర్తించడానికి ప్రాథమికంగా ఈసీజీ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. గుండె పనితీరు పరీక్షించడానికి 2డీ ఇకో, యాంజియోగ్రామ్‌లాంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

యుక్త వయసులోనే తనువు చాలింపు..

ప్రస్తుతం చోటు చేసుకుంటున్న ఆకస్మిక గుండెపోటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న వయసులోనే పలువురు ఆకస్మికంగా తనువు చాలిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు ఎక్కువయ్యాయి. మారిన జీవనశైలి, వృత్తి, ఇతర అంశాల్లో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా గుండె సంబంధిత అనారోగ్యంతో మరణాల సంఖ్య పెరగటానికి కారణమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అలాగే నియమిత ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమలేని జీవన శైలి కూడా కారణాలేనని చెబుతున్నారు.

ప్రథమ చికిత్సే ప్రధానం

గుండెపోటు వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించాల్సి ఉంటుంది. పట్టణాలు, నగరాల్లో గుండె చికిత్స అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సకాలంలో వైద్యం అందే అవకాశం ఉంది. వైద్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణనష్టం జరగకుండా నివారించవచ్చు. ఛాతిలో నొప్పి, చెమటలు పట్టడం, కళ్లు తిరగడం, చేతులు లాగడం, గుండె సాధారణం కన్నా ఎక్కువగా కొట్టుకోవడం, తదితర లక్షణాలతో గుండెనొప్పిని గుర్తించవచ్చు. ఆ సమయంలో రోగిని గాలి ఆడేలా ఉంచి ఆక్సిజన్ అందించేందుకు ప్రయత్నించాలి. సీపీఆర్ నిర్వహించి శ్వాస ఆడేలా చేయాలి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

ఈ జాగ్రత్తలు మేలు..

- సాధ్యమైనంత వరకు ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంచుకునేందుకు రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా విటమిన్ లోపాన్ని అధిగమించొచ్చు.
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను మెరుగుపర్చుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్లను అధిగమించొచ్చు.
- మద్యం, మాంసం, ఇతర కొవ్వు పదార్థాలకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.
- పార్కులు, ఇతర ఆహ్లాదకరమైన వాతావ రణంలో గడపడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చు.

గుండె పనితీరు పరీక్షించుకోవాలి



ప్రతి ఒక్కరూ గుండెకు సంబంధించిన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. గుండె పనితీరును ప్రతి ఒక్కరూ పరీక్షించుకోవాలి. అందుబాటులో ఉన్న పరీక్షల ద్వారా హృదయం పనితీరును పరిశీలించవచ్చు. వయస్సు, అనారోగ్య సమస్యల ఆధారంగా గుండెను వైద్యుల పర్యవేక్షణలో పరిశీలించుకోవడం తప్పనిసరి.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్

జాగ్రత్తలు తప్పనిసరి



జీవన శైలిలో మార్పుల మూలంగా గుండెజబ్బులకు గురయ్యేవారు పెరుగుతున్నారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ మితమైన ఆహారం తీసుకోవడం, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్స్ ఉండేలా చూసుకోవాలి. మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలి. ప్రతీరోజు కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయాలి.

– డాక్టర్ గౌతమ్ కింతాడ, గుండె వ్యాధి నిపుణులు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



పవర్ ప్లాంటు ఈడీకి విన్నవిస్తున్న రియాజ్ అహ్మద్

జైపూర్: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. శనివారం ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావును కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్టీగ్ సంస్థ నుంచి కార్మికులకు రావాల్సిన సెటిల్‌మెంట్స్ చెల్లించాలన్నారు. పవర్‌మేక్ కంపెనీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ స్థానికులకు అవకాశం కల్పించకుండా కక్షసాధింపుగా వ్యవహరిస్తోందన్నారు. ఫైర్ డిపార్టుమెంట్‌లో భూనిర్వాసితులు, ప్రభావిత గ్రామాల యువతకు అవకాశం కల్పించడంతో పాటు తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. 2016 నుంచి 2025 వరకు 8.33 బోనస్ చెల్లించే విధంగా చూడాలన్నారు. నైపుణ్యం లేని ఇంజినీర్లను నియమించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, అనుభవం ఉన్న ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు చేపట్టాలని కోరారు. హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నవీన్, ప్రచార కార్యదర్శి నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తమై.. ప్రాణాలు కాపాడి



గంగాధర్‌ను తీసుకొస్తున్న కవీంధర్, కిషోర్

బాసర: బాసర గోదావరి నది బ్రిడ్జి పైనుంచి దూకేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని నిజామాబాద్ జిల్లా యంచ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కాపాడి మానవత్వం చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ధర్మారంకు చెందిన గంగాధర్ శనివారం గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకేందుకు యత్నిస్తుండగా అటుగా వెళ్తున్న కవీంధర్, కిషోర్ అతన్ని కాపాడి బాసర పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గంగాధర్‌ను విచారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నిండు జీవితాన్ని కాపాడిన కవీంధర్, కిషోర్‌ను పలువురు అభినందించారు.

జల్సాల కోసం దొంగతనాలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.కృష్ణ



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

● నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

సారంగపూర్: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ రూరల్ సీఐ ఎం.కృష్ణ, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ రూరల్ మండలం భాగ్యనగర్‌కు చెందిన ముప్కాల రాకేష్‌రెడ్డి గతంలో దాబాహోటళ్లు, వైన్ షాపుల్లో పనిచేసేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ నెల 12న సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామంలో ద్విచక్ర వాహనం అపహరించాడు. వాహన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తులో భాగంగా చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద రాకేష్‌రెడ్డి చోరీ చేసిన మరోబైక్‌తో పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా నిజామాబాద్ జిల్లా ముప్కాల్, నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో రెండు ద్విచక్ర వాహనాలు, జిల్లా కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో సామగ్రి దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పూత అంతంతే..

● చెట్లను ఆశిస్తున్న తేనె మంచు పురుగు

● ఆందోళనలో మామిడి రైతులు



తేనె మంచు ఆశించిన మామిడి చెట్లు



లింగంపల్లి సమీపంలో పూతదశలో ఉన్న మామిడితోట

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది మామిడి చెట్లకు పూత అంతంత మాత్రంగానే ఉంది. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాలకు పైగా మామిడితోటలు ఉన్నాయి. బెల్లంపల్లి, నెన్నెల, అవుడం, చిత్తాపూర్, భీమారం, చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి, కొమ్మెర, ఆస్నాద, బుద్దారం, సంకారం, కన్నెపల్లి, సుద్దాల, కమ్మరిపల్లి, గంగారం, తదితర గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో మామిడి తోటలు ఉన్నాయి.

ఆశిస్తున్న తేనె మంచు పురుగు

ఏటా డిసెంబర్ చివరివారంలో మామిడిచెట్లకు పూత వస్తుంది. కానీ ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా స్వల్పంగానే మామిడిపూత వచ్చింది. దీనికితోడు మామిడిచెట్లను తేనె మంచు పురుగు ఆశించింది. దీంతో పిందెలు రాలిపోతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే వరకు ప్రకృతి కరుణిస్తే పిందెలు రాలిపోకుండా ఉంటుంది. మే నెల వరకు కాయలు పూర్తిగా ఎదిగి రైతులకు ఆశించిన దిగుబడులు వస్తాయి. కానీ ఏటా ఈదురుగాలులు, అకాల వర్షాలతో కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. తోటలకు ఏ పరిస్థితుల్లో ఎలాంటి మందులు పిచికారీ చేయాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియడంలేదని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా మంచిర్యాల జిల్లాలో సరైన మామిడికి మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్, తదితర ప్రాంతాలకు వెళ్లి మామిడి కాయలు విక్రయించాల్సి వస్తోంది.

నివారణ చర్యలు

ప్రస్తుతం మామిడితోటలను తేనె మంచు పురుగు ఆశిస్తోంది. దీని నివారణకు ఇమిడా, లామ్డా, థయామిధాక్సమ్ వంటి మందులు పిచికారీ చేయాలి. మొగ్గ పెరుగుదల దశలో (జనవరి 15 నుంచి) తేలిక పాటి నీటితడులు ఇవ్వడం ద్వారా త్వరగా పూత విచ్చుకుని ఫలదీకరణ చెందుతుంది. పదేళ్లు పైబడిన చెట్లకు నాలుగు డ్రిపర్లు చెట్టుకాండం నుంచి మీటరు దూరంలో ఉండేటట్లు చూడాలి. ఒక చెట్టుకి 60 నుంచి 80 లీటర్లు నీరు అందేటట్లు (రోజుకు 2 గంటలు) ఇవ్వాలి. సూక్ష్మధాతు లోపం ఉన్న తోటల్లో 1.25 గ్రాముల బోరాన్ (19 శాతం) లీటరు నీటికి (125 గ్రాముల, 100 లీ. నీటికి) కలిపి మొగ్గల పెరుగుదల దశలో పిచికారీ చేయడం ద్వారా ఫలదీకరణ బాగా జరిగి పిందె బాగా కట్టి అధిక దిగుబడి వస్తుంది. మామిడి పిందె దశలో (జొన్నగింజ పరిమాణం) ఉన్నప్పుడు నాఫ్తలిన్ అసిటిక్ ఆమ్లం (ఎన్ఏఏ) 20 పి.పియమ్ (2 గ్రాములు 100 లీటర్ల నీటికి) గాఢతలో రెండుసార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తద్వారా పూత, పిందె బాగా నిలబడుతుంది. కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా కాయ అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని త్వరగా పెరుగుతుంది. ప్రస్తుతం మామిడి పూత దశలో ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

పూత సరిగా రాలేదు



కొన్ని మామిడి చెట్లకు మాత్రమే పూత వచ్చింది. ప్రకృతి సహకరిస్తే దిగుబడి బాగా ఉంటుంది. ఏటా అకాల వర్షాలు, ఈదురుగాలులతో తీవ్రంగా నష్ట పోతున్నాం. గతేడాది కూడా కాత లేక నష్ట పోయాం.

– మదె అర్జయ్య, మామిడి రైతు, సంకారం

పిందెలు రాలుతున్నాయ్



ఈ ఏడు మామిడి చెట్లకు పూత సరిగా రాలేదు. తేనెమంచు పురుగు ఎక్కువగా ఆశిస్తోంది. వాతావరణ మార్పులతో కాసిన కాయలు కూడా నేల రాలుతున్నాయి. పూత వచ్చిన చెట్లకు పిందెలు ఇప్పుడే అవుతున్నాయి.

– తిరుపతి, మామిడి రైతు, బుద్దారం

సలహాలు, సూచనలు ఇస్తున్నాం

ఈ ఏడాది మామిడి చెట్లను తేనె మంచు పురుగు ఆశించింది. రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. తేనె మంచు పురుగు నివారణకు రైతులు ఇమిడా, లామ్డా మందులతో పాటు థయమిధాక్సమ్ మందును పిచికారీ చేయాలి. ప్రస్తుతం పూత నుండి పిందె దశకు చేరుకుంటుంది. ఈ సమయంలో మామిడి చెట్లకు నీటిని అందించాలి. మల్టికే న్యూట్రిషన్లు పిచికారీ చేయాలి.

– కళ్యాణి, ఉద్యానవనశాఖ అధికారి, చెన్నూర్

హైదరాబాద్‌లో బామ్నికే యువతి ఆత్మహత్య



అంకిత (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన మద్రి అంకిత (21)హైదరాబాద్‌లోని పోచారం కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాస్టల్ గదిలో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మద్రి లక్ష్మి, రమేశ్ దంపతుల పెద్దకుమార్తె అంకిత డిగ్రీ రెండవ సంవత్సరం వరకూ చదివింది. హైదరాబాద్‌లోని పోచారం మున్సిపాలిటీ జీడిమెట్ల హాఫా కార్తి కేయ కాలనీలోని వసతి గృహంలో ఉంటూ ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో కొనసాగుతున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందుతోంది. శుక్రవారం కడుపులో నొప్పిరావడంతో భరించలేక గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..



లక్ష్మణ్ (ఫైల్)

మామడ: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఆదర్శనగర్ గ్రామానికి చెందిన బర్కుంట లక్ష్మణ్ (33) తనకున్న ఎకరం భూమిలో సాగు చేయడంతో పాటు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనోవేదనకు గురయ్యాడు. శనివారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మార్కగూడ పంచాయతీ పరిధిలోని వాడిగూడకు చెందిన పర్చకి జంగు (21) శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పెందూర్‌గూడకు చెందిన సిద్దార్థ గిన్నెదరి నుంచి పెందూర్‌గూడకు బయలుదేరాడు. సల్పాలగూడ వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొట్టడంతో జంగుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి భుజంగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి షేక్ సాజీద్ శుక్రవారం అదృశ్యమయ్యాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరుడు షేక్ ముజాయిద్ శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు.

కోతుల దాడిలో బాలునికి గాయాలు



గాయపడిన బాలుడు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన బాలుడు శ్రీజుపై శనివారం కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. డబుల్ బెడ్‌రూం కాలనీ చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో కోతుల బెడద తీవ్రమైందని కాలనీ వాసులు వాపోతున్నారు.